సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 9 । మే । 2025



కార్పొరేట్ లాభాల కోసమే లేబర్ కోడ్‌లు

ఈ నెల 20న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు.


10లో



కావాలనే కడ తేర్చారా?

పాపం పుణ్యం తెలియని పసికందును తమకు అడ్డం వస్తుందనే, కావాలనే కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయినట్లు తెలిసింది.

9.25 అడుగుల నీటిమట్టం



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి గోదావరి మిగులు జలాల విడుదలను గురువారం నిలిపివేశారు. దీంతో, బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.25 అడుగులకు పెరిగింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

కలెక్టర్ ప్రశాంతికి రెడ్‌క్రాస్ పురస్కారం



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రెడ్‌క్రాస్ పురస్కారం అందుకున్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు గవర్నర్ ఈ పురస్కారం, ప్రశంసా పత్రం అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పని చేసిన సమయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత ప్రచారం కల్పించడం, ప్రజాప్రయోజనాల నేపథ్యంలో పలు కార్యక్రమాలు చేపట్టినందుకు గాను ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా రెడ్‌క్రాస్ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. ముఖ్యంగా యూత్ రెడ్‌క్రాస్ సభ్యులుగా విద్యార్థులను చేర్పించాలని సూచించారు.

12 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

రాజమహేంద్రవరం రూరల్: ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) టి.సీతారామమూర్తి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఇంటర్మీడియెట్ అధికారి ఎస్ఎస్‌వీఎల్ నరసింహం మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 20,446 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులకు 37, సెకండియర్ విద్యార్థులకు 16 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయని వివరించారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్: ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలుంటే శుక్రవారంలోగా ఉమ్మడి జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి సమర్పించవచ్చని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలోని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుల (ఆర్‌జేడీ) పరిధిలో ప్రభుత్వ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్ల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించారని వివరించారు. దీనిపై అభ్యంతరాలకు గత నెల 4 వరకూ గడువు ఇచ్చారని, వచ్చిన అభ్యంతరాల ప్రకారం జాబితాలు తయారు చేసి కాకినాడ ఆర్‌జేడీ వెబ్‌సైట్ www.rjdsekkd లోను, ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విద్యా శాఖల వెబ్‌సైట్లలోను, నోటీసు బోర్డుల్లోను అందుబాటులో ఉంచారని తెలిపారు. దీనిపై అభ్యంతరం తెలిపే వారు ఆ ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలని, అందుకు సంబంధించిన ఆధారాలు లేదా సంబంధిత సాక్ష్యాలు ఉంటే జత చేయాలని సూచించారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు.



కొండ దిగువన గరుడ, గజ వాహనాలపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు



కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలి వచ్చిన భక్తులు



విద్యుద్దీప కాంతుల్లో మెరిసిపోతున్న సత్యదేవుని సన్నిధి

కల్యాణం.. రమణీయం..

- కన్నుల పండువగా సత్యదేవుని దివ్య కల్యాణోత్సవం
- తిలకించి పులకించిన భక్తజనం
- మంచి ముత్యాలు, పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రముఖులు

అన్నవరం: భక్తవరదుడు, రత్నగిరి వాసుడు, సత్యమైన దైవంగా పేరొందిన అన్నవరం సత్యదేవుడు.. దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పరిణయమాడిన వేళ.. ఆ మహోత్సవాన్ని కన్నులారా తిలకించిన భక్తులు పులకించిపోయారు. వైశాఖ శుద్ధ ఏకాదశి, గురువారం రాత్రి 10.30 గంటల సుముహూర్తంలో సత్యదేవుని వార్షిక దివ్య కల్యాణం ఆద్యంతం వైభవంగా జరిగింది. పండితోత్తములు పఠించిన సుస్వర వేద మంత్రాలు సాక్షిగా, అమ్మవారిని స్వామివారు పరిణయమాడిన శుభవేళ.. యావత్ భక్తకోటితో పాటు రత్న, సత్యగిరులు, వాటిపై తరులు.. పంపా ఝరులు పులకించాయి.

సీతారాములే పెళ్లిపెద్దలుగా..

రత్నగిరిపై రామాలయం పక్కన.. సుగంధభరిత పుష్పాలు, విద్యుద్దీపాలతో వార్షిక కల్యాణ వేదికను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. రత్నగిరి క్షేత్ర పాలకునిగా పూజలందుకుంటున్న సీతారాములే పెళ్లిపెద్దలుగా వెంట రాగా.. వధూవరులైన అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారి, సత్యదేవుడిని.. రాత్రి 9 గంటలకు ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. స్వామి, అమ్మవార్లను దివ్యంగా అలంకరించిన సింహాసనం మీద, సీతారాములను మరో ప్రత్యేక ఆసనం మీద వేంచేయించారు. వేద పండితులు, ఆలయ ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్య శర్మ, దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు అంగర సతీష్, పాలంకి పట్టాభి తదితరుల సుస్వర వేదమంత్రోచ్చారణలతో రాత్రి 9.30 గంటలకు కల్యాణ క్రతువు ఘనంగా ప్రారంభమైంది.



సత్యదేవుని కల్యాణంలో భాగంగా మంగళ సూత్రాలను భక్తులకు చూపిస్తున్న అర్చకులు

కల్యాణ క్రతువు జరిగిందిలా..

స్వామివారి కల్యాణోత్సవానికి ఎటువంటి విఘ్నాలూ కలగకుండా చూడాలని సమస్త గణాధిపతీ అయిన విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తూ పండితులు విఘ్నేశ్వర పూజతో క్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం పుణ్యాహవాచనం, పాణిగ్రహణ సంకల్పం నిర్వహించారు. అమ్మవారితో గౌరీ పూజ చేయించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల గోత్ర ప్రవరలను పండితులు వీనులవిందుగా వివరించారు. సత్యదేవునికి యజ్ఞోపవీతధారణ గావించారు. అనంతరం మహాసంకల్పం, స్వామివారి పాద ప్రక్షాళన (కాళ్లు కడగడం), కన్యాదానం, మధుపర్క ప్రాశన ఘట్టాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్య ఘోష, వేద మంత్రోచ్చారణల నడుమ సత్యదేవుడు, అమ్మవార్ల శిరస్సులపై రాత్రి 10.44 గంటలకు జీలకర్ర – బెల్లం ఉంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. వధువు ఆయురారోగ్యాలతో శాశ్వతంగా వర్ధిల్లాలని ప్రార్థిస్తూ యుగచ్ఛిద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యశర్మ భక్తులకు మంగళసూత్రం చూపించారు. రాత్రి 10.55 గంటల సుముహూర్తంలో స్వామివారి తరఫున అర్చకుడు ఆ మంగళసూత్రాన్ని అమ్మవారి మెడలో అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు అర్చకులు మంచి ముత్యాలతో కూడిన తలంబ్రాలు పోశారు.

అదే సమయంలో సత్యదేవుని గర్భాలయంలో సత్యదేవుడు, అమ్మవారి మూలవిరాట్టులకు కూడా పండితులు ఊరేగింపుగా వెళ్లి అక్షతలు పోశారు. తరువాత నవదంపతులకు రక్షాబంధనాలు, వేదాశీస్సులు అందజేసి, ఊరేగింపుగా ప్రధానాలయానికి చేర్చారు. తొలుత రాత్రి 7 గంటలకు స్వామివారిని గరుడ వాహనం, అమ్మవారిని గజ వాహనంపై కొండ దిగువన ఘనంగా ఊరేగించారు.

పట్టు వస్త్రాలు.. ముత్యాల తలంబ్రాలు

సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, జ్యోతుల నెహ్రూ, యనమల దివ్య దంపతులు, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు దంపతులు ముత్యాల తలంబ్రాలు, నూతన వస్త్రాలు సమర్పించారు. టీటీడీ, విజయవాడ దుర్గ గుడి, ద్వారకా తిరుమల దేవస్థానం తరఫున కూడా ఆయా దేవస్థానాల పండితులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణానంతరం సర్క్యులర్ మండపం, బుకింగ్ కౌంటర్, పశ్చిమ రాజగోపురం వద్ద భక్తులకు తలంబ్రాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. కల్యాణోత్సవం సందర్భంగా రత్నగిరి, కల్యాణ వేదిక వద్ద చేసిన విద్యుద్దీపాలంకరణ, పుష్పాలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి కల్యాణ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అన్నవరంలో నేడు

తెల్లవారుజామున 3.00 : సుప్రభాత సేవ
ఉదయం 8.00 : చతుర్వేద పారాయణ
సాయంత్రం 5.00 : ప్రధాన స్థాలీపాక హోమాలు
రాత్రి 7.00 : నవదంపతులు స్వామి, అమ్మవార్లకు అరుంధతీ నక్షత్ర దర్శనం
రాత్రి 9.00 : రావణబ్రహ్మ వాహనంపై కొండ దిగువన సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు
ఉదయం 7.00 నుంచి 10.00, సాయంత్రం 5.00 నుంచి రాత్రి 11.00 : రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు

భారీ బందోబస్తు

పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు ఆధ్వర్యాన పదిమంది ఎస్సైలు, 200 మంది పోలీసులతో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక యంత్రాలను, సిబ్బందిని కల్యాణ వేదిక వద్ద సిద్ధంగా ఉంచారు. భక్తుల వాహనాలను కొండ పైకి పరిమితంగానే అనుమతించారు. దేవస్థానం కళాశాల మైదానంలో ఉచిత పార్కింగ్ ఏర్పాటు చేశారు.



పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిస్తున్న చైర్మన్ రోహిత్, ఈఓ సుబ్బారావు దంపతులు



అలరించిన నృత్య ప్రదర్శనలు





వేదిక ముందు ప్రత్యేక ఆకర్షణగా గరుత్మంతుడు, ఆంజనేయ స్వామి మూర్తులు

విమానాశ్రయంలో మాక్‌డ్రిల్

కోరుకొండ: యుద్ధ పరిస్థితుల్లో ప్రజలు ఏవిధంగా స్పందించాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ ఏఎస్పీ చెంచిరెడ్డి ఆధ్వర్యాన గురువారం సాయంత్రం మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబు పేలుళ్లు జరిగినప్పుడు విమాన ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. బాంబింగ్ సమయంలో ప్రయాణికులు పరుగులు తీయకుండా నేలకు వాలి ఉండటం సురక్షితమని చెప్పారు. కార్యక్రమంలో విమానాశ్రయం ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీకాంత్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ప్రసాదరావు, అగ్నిమాపక అధికారి గుప్తా, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై కూన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విమానాశ్రయంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

మాక్‌డ్రిల్‌తో ప్రజలకు అవగాహన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యుద్ధ పరిస్థితుల్లో ప్రజలు ఏవిధంగా స్పందించాలనే అంశంపై మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సమీపంలో రోడ్ కం రైల్వే వంతెన వద్ద మాక్ డ్రిల్ ద్వారా గురువారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా, ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. యుద్ధ పరిస్థితులు వస్తే సైరన్ అలార్మింగ్ మోగుతుందని, దానిని అనుసరించి ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, ఇతరులను రక్షించడం, గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందజేయడం, తరలింపు ప్రక్రియల్లో భాగస్వాములు కావాలని కోరారు. యుద్ధ హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, స్వీయ రక్షణ చర్యలపై డీఆర్‌వో టి.సీతారామమూర్తి, ఆర్‌డీఓ ఆర్.కృష్ణనాయక్, డీఎస్పీ భవ్యకిషోర్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్ తదితరులు వివరించారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలి

- సాక్షి ఎడిటర్ ఇంట్లో నిర్బంధ సోదాలు అన్యాయం
- పాత్రికేయుల నిరసనలు


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేసే విధానాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలకాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పాత్రికేయులు గురువారం నిరసనలు తెలిపారు. ఎటువంటి సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు.. విజయవాడలో సాక్షి సంపాదకులు ధనంజయరెడ్డి ఇంట్లోకి చొరబడి, అక్రమంగా సోదాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ చర్యను ప్రజాసంఘాలు, పౌర సమాజం ముక్తకంఠంతో ఖండించాలని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల అక్రమ సోదాలను నిరసిస్తూ రాజమహేంద్రవరంలో సాక్షి పాత్రికేయులు గురువారం సాయంత్రం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఆర్‌డీఓ ఆర్.కృష్ణనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వార్తలు రాస్తున్నందుకు సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదని అన్నారు. ఎటువంటి ముందస్తు నోటీసులూ లేకుండా అక్రమంగా సోదాలు చేసి భయభ్రాంతులకు గురి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ప్రభుత్వ విధానాలపై వార్తలు రాస్తే వాటిరి వివరణలు ఇవ్వవచ్చని, అంతే తప్ప ఎడిటర్ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేసేలా ప్రవర్తించడం మంచిది కాదని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ రిపోర్టర్ ఫయాజ్ బాషా, సాక్షి టీవీ ప్రతినిధి హరీష్, కెమెరామన్ మురళి, ఆర్‌సీ ఇన్‌చార్జులు కె.శ్యామ్‌శేఖర్‌రెడ్డి, వై.విశ్వనాథం, విలేకర్లు సత్యంబాబు, అంగర రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ఆర్‌డీఓకు వినతి పత్రం అందిస్తున్న సాక్షి విలేకరులు

పోలీస్ స్టేషన్ వద్ద జర్నలిస్టుల ధర్నా

నిడదవోలు: సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసుల అక్రమ సోదాలను నిరసిస్తూ నిడదవోలు జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యాన పాత్రికేయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా పోలీసులు తనిఖీలు చేయడాన్ని నిరసిస్తూ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలని నినదించారు. అనంతరం సీఐ పీవీజీ తిలక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ నాయకులు మాట్లాడుతూ, ముందస్తు నోటీసు ఇవ్వకుండా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలు దారుణమని, ఇది ప్రజాస్వామ్యాన్ని, పత్రికా రంగాన్ని అవమానించడమేనని అన్నారు. ఇటువంటి సంస్కృతి ఎప్పుడూ చూడలేదన్నారు. వాస్తవాలను ప్రచురిస్తున్న పత్రికలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో సాక్షి నిడదవోలు ఆర్‌సీ ఇన్‌చార్జి గాడి శేఖర్‌బాబు, సాక్షి విలేకర్లు ఎం.సత్యనారాయణ, ఎం.రవితేజ, సయ్యద్ ఇబ్రహీం, జర్నలిస్టులు కాట్రు వసంతరాజు, గూడూరి రమణ, మహమ్మద్ జావీద్, గురునాథరెడ్డి, టి.రాము, కె.మణికంఠ, షేక్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

పదవి కోసం ఫైట్..!

- రాజానగరం టీడీపీలో ముసలం!
- నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోసం పట్టు
- ఇరు వర్గాలుగా విడిపోయిన చౌదరి, పెందుర్తి వర్గాలు
- చంద్రబాబు వద్ద చక్రం తిప్పుతున్న వెంకటేష్ తనయుడు



బొడ్డు వెంకట రమణ చౌదరి



పెందుర్తి వెంకటేష్

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోసం ఫైట్ మొదలైందా.. దీనిపై ఇరు వర్గాల మధ్య వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయా.. నియోజకవర్గ పగ్గాల కోసం ఇరు వర్గాలూ నువ్వా నేనా అనే రీతిలో తలపడుతున్నాయా.. ఇప్పటికే ఉన్న ఇన్‌చార్జిని తప్పించి, ఆ పదవిని దక్కించుకునేందుకు మరో నేత సీఎం స్థాయిలో పావులు కదుపుతున్నారా అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి.

రాజానగరం నియోజకవర్గం టీడీపీలో ఆధిపత్య పోరు సాగుతోంది. పార్టీ ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి, సీఎం పర్యటన వ్యవహారాల పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ వర్గాల మధ్య వర్గ పోరు తారస్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే వెంకటేష్ తనయుడు అభిరామ్ కొద్ది రోజులుగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ శ్రేణులతో మంతనాలు చేస్తున్నారు. ఈ పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ఇప్పటికే ఇన్‌చార్జిగా ఉన్న బొడ్డు వెంకట రమణ చౌదరికి రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ పదవి కట్టబెట్టారు. దీంతో, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిని పెందుర్తి వెంకటేష్‌కు ఇచ్చే అవకాశాలున్నాయన్న వాదన వినిపిస్తోంది.

తనయుడి రంగ ప్రవేశంతో..

ఈ పరిస్థితుల్లో పెందుర్తి వెంకటేష్‌ను సీఎం పర్యటన వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించడంతో ఆయన తనయుడు అభిరామ్ రంగంలోకి దిగారు. నియోజకవర్గంలో చురుకుగా పర్యటిస్తున్నారు. తండ్రితో పరిచయం ఉన్న నేతలతో మంతనాలు చేస్తున్నారని సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. తనకు మంత్రి లోకేష్ అండదండలున్నాయని, ఈ పదవి తనకే దక్కుతుందనే ధీమాలో ఆయన ఉన్నట్లు చెబుతున్నారు. లోకేష్ నుంచి సైతం ఇప్పటికే సుముఖత వ్యక్తమైనట్లు సమాచారం. మరోవైపు పెందుర్తి వెంకటేష్ సైతం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోసం సీఎం చంద్రబాబు స్థాయిలో పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఈ పరిణామం చౌదరి వర్గంలో ఆగ్రహావేశాలు నింపుతోంది. కష్ట కాలంలో పార్టీకి సేవ చేసిన చౌదరిని నియోజకవర్గ పదవికి దూరం చేయడమేమిటని ఆయన వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలను సైతం త్యాగం చేసిన నేతను విస్మరించాలని చూడటం ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దీంతో, టీడీపీ శ్రేణులు ఇరు వర్గాలుగా విడిపోయి, తరచూ వివాదాలకు దిగుతున్నారు.

- ఇటీవల సీతానగరం మండలం రఘుదేవపురంలోని పేకాట స్థావరంపై ఓ వర్గం దాడులు చేయించి, కేసు నమోదు చేయడానికి ప్రయత్నించారని మరో వర్గం ఆరోపించింది.

'ఉనికి'పాట్లు

రాజానగరం టీడీపీలో ఉనికిపాట్లు మొదలయ్యాయి. కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కేవలం జనసేన నేతలకే ప్రాధాన్యం ఇస్తూ, టీడీపీ నేతలను పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో టీడీపీ ఇన్‌చార్జి పదవికి ప్రాధాన్యం పెరిగింది. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ గతంలో రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పని చేశారు. అప్పట్లో సీఎం చంద్రబాబును విమర్శిస్తూ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో బొడ్డు వెంకట రమణ చౌదరికి అవకాశం కల్పించారు. అప్పటి నుంచీ ఆయనే కొనసాగుతున్నారు. రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్టును చౌదరి ఆశించగా.. పొత్తులో భాగంగా అది కాస్తా జనసేన ఖాతాలోకి పోయింది. దీంతో భంగపడిన చౌదరి.. చివరకు పార్టీ ఆదేశాలకు కట్టుబడి జనసేన విజయానికి కృషి చేశారు.

- కోరుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కోడిపందాలపై దాడి చేసి, పలువురిని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించినట్లు సమాచారం. టీడీపీలోని ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో భాగంగానే ఇది జరిగిందని ఆ పార్టీ శ్రేణులే విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇరు వర్గాల మధ్య తలెత్తుతున్న విభేదాలతో అధికారులు నలిగిపోతున్నారు.

క్లుప్తంగా

ఆస్తి తగాదాలో తండ్రిపై కుమార్తె దాడి

మలికిపురం: మండల కేంద్రం మలికిపురంలో తండ్రి ఇంజేటి శ్రీనుపై కుమార్తె చాకుతో దాడి చేసింది. ఆస్తి విషయంలో గురువారం ఉదయం నుంచి ఇంట్లో గొడవ పడ్డారు. మధ్యాహ్నం వేళకు గొడవ శృతి మించి కుమార్తె చాకుతో తండ్రిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన శ్రీనును ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై ఎటువంటి సమాచారం ఇంకా రాలేదని మలికిపురం పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మలికిపురం: మండలంలో చింతలమోరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో తరలిస్తున్న 1,995 కేజీల బియ్యంను స్వాధీనం చేసుకుని గ్రామంలోని వెంకటేశ్వరా రైస్ మిల్లుకు తరలించినట్లు ఎస్సై పి.వి.వి.సురేష్ తెలిపారు. వాహనాన్ని ఆపి సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించగా అధికారులు బియ్యం సీజ్ చేశారు. వెహికిల్‌ను స్టేషన్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

రాజానగరం: అక్రమంగా తరలిస్తున్న 650 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీన పర్చుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని స్థానిక ఎస్సై నాగార్జున తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఫరిజల్లిపేట నుంచి రాజానగరం వైపు ఆటోలో వస్తున్న ఈ బియ్యాన్ని కాపు కాచి పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వ్యక్తుల నుంచి మరింత ఆరా తీస్తున్నామని చెప్పారు. స్వాధీన పర్చుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్సీ పాయింట్ వద్ద భద్రపరిచామని, కేసు దర్యాప్తులో ఉందన్నారు.

ప్రథమ చికిత్సతో ప్రాణ రక్షణ

- పశువులు ప్రమాదంలో చిక్కుకుంటే ఆందోళన చెందవద్దు
- ప్రథమ చికిత్స అందించి వైద్యులను సంప్రదించాలి


డాక్టర్ ఎ.నాగశ్రావణి



పాడి-పంట

రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లోని పశువులు తోటలు, పొలాల్లోకి మేతకు వెళ్తుంటాయి. చెట్టుచేమల్లో గడ్డిని మేసే సమయంలో ఒక్కొక్కసారి విష పురుగులు, విద్యుత్ ప్రమాదాల బారిన పడుతుంటాయి. పశువులు ప్రమాదాల్లో చిక్కుకున్న సమయంలో పాడిరైతులు ఆందోళన చెందకుండా వెంటనే ప్రథమ చికిత్స అందిస్తే పశువులను ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునంటున్నారు రాయవరం మండల పశువైద్యాధికారి ఎ.నాగశ్రావణి. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

పాముకాటుకు గురైతే..
పశువులు పాముకాటుకు గురైతే విషం రక్తనాళాల ద్వారా శరీరమంతా వ్యాపించి రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఒక్కోసారి పశువులు వెంటనే మరణించే అవకాశం ఉంది. పాముకాటు వేసినచోట ఎర్రగా మారి వాపు వస్తుంది. రెండు గాట్లు వెంబడి రక్తం వస్తుంది. పశువులు కింద పడిపోవడం, నోటి నుంచి చొంగ రావడం, కళ్లు తేలేయడం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

చికిత్స ఇలా..
అటువంటి సమయంలో పాముకాటు గుర్తించిన చోట రక్తం బయటకు వచ్చేలా గట్టిగా నొక్కాలి. అందుబాటులో టించర్ అయోడిన్ ఉంటే పాముకాటు వేసిన చోట పూయాలి. విషం పశువు శరీరంలోనికి ప్రవేశించకుండా పై భాగంలో తాడు/గుడ్డతో గట్టిగా కట్టాలి. ఆ తర్వాత పశువైద్యుడిని సంప్రదించి యాంటీవీనమ్ టీకా వేయించాలి. పశువులను బాగా గాలి సోకే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస బాగా ఆడేలా చూసుకోవాలి.

విద్యుదాఘాతానికి గురైతే..
పశువులు విద్యుదాఘాతానికి గురైతే కొన్నిసార్లు వెంటనే మరణిస్తాయి. ఓల్టేజీ తక్కువగా ఉండి షాక్‌కు గురైతే శరీరంపై కాలిన మచ్చలు వస్తాయి. విద్యుదాఘాతానికి గురైన సమయంలో గిలగిలా కొట్టుకుని స్పృహ కోల్పోతాయి. కొన్ని సందర్భాల్లో పక్షవాతానికి కూడా గురవుతాయి. ముట్టుకుంటే అతిగా స్పందిస్తాయి. ఇలాంటి సమయంలో పశువులను నేరుగా తాకరాదు. విద్యుత్ నిలిపివేసిన తర్వాతనే పశువును ముట్టుకోవాలి. ప్రాణం ఉందని గుర్తించిన వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

అగ్ని ప్రమాదాల బారిన పడితే..

గ్రామాల్లో ముఖ్యంగా పశువులు పాకలు అగ్ని ప్రమాదాల బారిన పడుతుంటాయి. ఆ సమయంలో పశువుల పాకల్లో ఉన్న గేదెలు, ఆవులు ప్రమాదంలో చిక్కుకుని కాలిపోతాయి. పశువుల కొట్టాం అగ్ని ప్రమాదంలో చిక్కుకుంటే ముందుగా పలుపుతాళ్లు కోసి పశువులను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి. కాలిన గాయాలపై తరచు చన్నీళ్లు పోయాలి. వీలైతే పశువును చెరువులోనికి దింపి శరీరం పూర్తిగా తడిసేలా చేయాలి. పశువులను అరటి ఆకులపై పడుకొనేలా చూడాలి. పశువులకు అయిన గాయాలపై వరిపిండిలో ఏక్రిఫ్లేవిన్ పౌడర్‌ను వరిపిండి, కొబ్బరినూనె కలిపి పూయాలి. నడవలేని స్థితిలో ఉంటే పశువైద్యుడిని ఘటనా స్థలికి తీసుకుని వచ్చి వైద్యం చేయించాలి.

విషాహారం తింటే..
పంటను ఆశించే చీడపీడల నివారణకు రైతులు విష పూరితమైన రసాయనిక ఎరువులను పిచికారీ చేస్తారు. అనుకోకుండా పశువులు వాటిని తినడం వలన శరీరంలోనికి విషం ప్రవేశిస్తుంది. దీనివల్ల కళ్లు తేలేయడం, నోటి వెంట చొంగ కారడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. ఇలాంటి సమయంలో పశువుకు కలప బొగ్గుపొడి కలిపిన నీటిని తాగించాలి. అది విష పదార్థాలను కొంత వరకు పీల్చుకుని పశువుకు హాని కలగకుండా చేస్తుంది. అలాగే వంట నూనె అరలీటరు, పది కోడిగుడ్ల తెల్లసొనను పశువులకు తాగించాలి. అనంతరం మెరుగైన వైద్యం కోసం పశువైద్యుడిని సంప్రదించాలి.

ప్రతిష్టాత్మకంగా సాహితీ సంబరాల ఈవెంట్


ప్రదర్శనల బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రతాప్

సఖినేటిపల్లి: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీలలో ఏలూరులో రెండు వేల మంది కవులు, కళాకారులతో ప్రతిష్టాత్మకంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు ఏర్పాటు చేసినట్టు వేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ అన్నారు. గురువారం సఖినేటిపల్లిలో ఈ మేరకు ఆయన ఈవెంట్‌లో ప్రదర్శించే వివిధ కళల ప్రదర్శనల బ్రోచర్ విడుదల చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ సాహితీ సంబరాలలో ఏ విధమైన ఫీజులు లేకుండా పాల్గొనే కవులు, కళాకారులు అందరినీ జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించనున్నట్టు వెల్లడించారు. కాగా సాహితీ చరిత్రలో అతి పెద్ద కార్యక్రమంగా రూపొందించిన ఈ ఈవెంట్‌ను కన్వీనర్‌లు కొల్లి రమావతి, డాక్టర్ పార్థసారధి, జి.ఈశ్వరీ భూషణం పర్యవేక్షిస్తారన్నారు. ఈవెంట్‌లో తెలుగు కవితోత్సవం, తెలుగు సాహిత్య సదస్సు, పుస్తకావిష్కరణలు, రంగస్థల ప్రదర్శనలు, జానపద కళలు, కూచిపూడి, భరతనాట్యం వంటి ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు ప్రతాప్ పేర్కొన్నారు.

ట్రాక్టర్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: చెడు వ్యసనాలకు బానిసై..ఈజీ మనీ కోసం ఒక వ్యక్తి రహదారి పక్కన పుల్లల లోడుతో ఆపి ఉన్న ట్రాక్టర్ విత్ ట్రైలర్‌ను అపహరించుకుపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న రాయవరం పోలీసులు నిందితుడిని గురువారం అరెస్ట్ చేశారు. మండలంలోని పసలపూడిలోని గోదావరి రైసు మిల్లు సమీపంలో అదే గ్రామానికి చెందిన పిల్లి జానకిరామయ్య గత నెల 10న పుల్లల లోడుతో ఉన్న ట్రైలర్‌తో కూడిన ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. ఉదయం చూసుకునే సరికి ట్రైలర్‌తో కూడిన ట్రాక్టర్ అక్కడ లేకపోవడంతో దొంగతనానికి గురైనట్లుగా భావించిన జానకిరామయ్య రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్సై సురేష్‌బాబు దర్యాప్తు చేపట్టారు. వెదురుపాక గీతామందిరం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కొంకుదురు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. చెడు వ్యసనాలకు బానిసై, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు పాల్పడినట్లుగా నిందితుడు అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు, హెచ్‌సీ సత్యకుమార్, పీసీలు వీరేంద్రను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

కార్పొరేట్ లాభాల కోసమే లేబర్ కోడ్‌లు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు


సదస్సులో మాట్లాడుతున్న నరసింగరావు

కాకినాడ సిటీ: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం యూటీఎఫ్ హోంలో జరిగిన జిల్లా కార్మిక సంఘాల జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. మోదీ మతోన్మాద ప్రభుత్వం భారతీయ కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని విమర్శించారు. స్వతంత్రానికి ముందుగానీ, తర్వాత గానీ వచ్చిన కార్మిక చట్టాలు ఒకరి దయతో వచ్చినవి కాదని, వేలాది మంది కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్నవని గుర్తు చేశారు. మూడు నల్ల చట్టాలతో రైతులను, నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికులను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కరోనా సంక్షోభాన్ని, ఉగ్రవాద సంక్షోభ పరిస్థితులను మోదీ మతోన్మాద ఎజెండాను అమలు పరిచేందుకు, కార్పొరేట్ శక్తులను సంతృప్తి పరిచేందుకు వాడుకుంటోందని విమర్శించారు. సమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ పాల్గొంటున్నాయని, ప్రభుత్వ పథకాలలో పని చేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు కూడా సమ్మెను బలపరచాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, ఏఐసీటీయూ రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, కాళ్ల నాగేశ్వరరావు, షేక్ పద్మ, మలకా రమణ, నక్కెళ్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, వేణి, వెంకటలక్ష్మి, గుబ్బల ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు. సదస్సు ప్రారంభోత్సవానికి ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



•సీతాకేకచిలుక!

అందానికే అందం అన్నట్లుగా సీతాకోక చిలుకలు పలు రంగుల్లో ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంటాయి. నల్లంచు తెల్లచీర..అంటూ ఓ సినీ కవి కోక అందాన్ని వర్ణిస్తే..తెల్లంచు నల్లచీర అన్నట్లుగా సాధారణ సీతాకోక చిలుకలకు భిన్నంగా ఈ సీతాకోక చిలుక దర్శనమిచ్చింది. నలుపు చీరపై ఎరుపు రంగు డిజైన్ వేసినట్టుగా ఉండడంతో పాటు రెక్కల ఆకృతి కూడా సరికొత్తగా ఉండి చూడగానే మనసు దోచిన ఈ సీతా'కేక'చిలుక రాయవరంలో 'సాక్షి' కెమెరాకు చిక్కింది.

– రాయవరం

కావాలనే కడ తేర్చారా?

- హత్య కేసును తప్పుదారి పట్టించడానికే క్షుద్రపూజల నాటకం
- పసికందు హత్య కేసులో ముమ్మర దర్యాప్తు


బావిలో బాలిక మృతదేహం

పిఠాపురం: పాపం పుణ్యం తెలియని పసికందును తమకు అడ్డు వస్తుందనే, కావాలనే కడతేర్చినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడయినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పసికందు హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఒక పథకం ప్రకారం కొందరు వ్యక్తులు పసికందును హత్య చేసి దానిని తప్పుదోవ పట్టించడానికి క్షుద్ర పూజల నాటకం ఆడినట్టు పోలీసులు గుర్తించారు. ఆ దిశలో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే హత్య కేసు చిక్కుముడి విడదీసిన పోలీసులు హత్య ఎందుకు చేశారు? ఎవరు చేశారు? ఎలా చేశారు? అనే విషయాలపై దృష్టి సారించి వాటికి సంబంధించిన క్లూ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. కుటుంబ సభ్యులు ఈ దారుణానికి ఒడిగట్టారనే బలమైన ఆధారాలు సేకరించిన పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఒకరితో బంధాన్ని తెంచుకోడానికి మరొకరితో బంధాన్ని కలుపుకోడానికి పేగు బంధాన్ని నిర్దాక్షిణ్యంగా తెంచేసినట్లు పోలీసుల దర్యాప్తు తేటతెల్లమైనట్టు తెలుస్తోంది. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేసినట్లు చెబుతున్నారు.

గుట్టువిప్పిన పసుపు కుంకుమ
పసికందును హత్య చేసిన ఇంట్లో క్షుద్ర పూజలు జరిగిన ఆనవాళ్లు కనిపించడంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. ప్రస్తుత సమాజంలో ఎక్కడా లేని క్షుద్రపూజలు పిఠాపురం పట్టణంలో జనసంచారం ఎక్కువగా ఉండే జగ్గయ్య చెరువులో కలకలం సృష్టించాయి. దీనిపై దృష్టి సారించిన పోలీసులు అసలు క్షుద్ర పూజలు జరిగాయా అన్న విషయంపై ఆరా తీయగా తీగ లాగితే డొంక కదిలినట్లు తెలిసింది. క్షుద్ర పూజలు చేసినట్లుగా ఏర్పాటు చేసిన పసుపు, కుంకుమ, నిమ్మకాయలను పరిశీలించిన పోలీసులు వాటి శాంపిల్ సేకరించి సంఘటన జరిగిన ఇంట్లో ఉన్న పసుపు, కుంకుమతో పోల్చి చూడగా రెండు ఒకటేనని తేలినట్లు సమాచారం. క్షుద్రపూజలు జరిగినట్టు జనాన్ని, పోలీసులను నమ్మించాలని నిందితులు ఏర్పాటు చేసిన పసుపు, కుంకుమ హత్య కేసు చిక్కుముడిని విప్పినట్టు తెలిసింది. కుటుంబ సభ్యులే ఇవి ఏర్పాటు చేశారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు వినికిడి. సాంకేతికత ఆధారంగా వాటిని ల్యాబ్‌కు పంపి నిర్ధారించే పనిలో పోలీసులు ఉన్నట్టు సమాచారం.

అవి క్షుద్ర పూజలు కాదు
పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో బాలిక హత్య జరిగిన ఇంట్లో క్షుద్ర పూజలు, చేతబడులు జరగలేదని అది కేవలం ఒక నాటకమని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి బుధవారం పోలీసు స్టేషన్‌కు వచ్చి తన మనుమరాలు అయిన ఐదు నెలల పాప కనిపించడం లేదని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పట్టణ ఎస్సై మణికుమార్ తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారన్నారు. గాలింపులో ఒక నూతిలో ఐదు నెలల పాప పడి చనిపోయి ఉండడాన్ని గమనించి బయటకు తీశారన్నారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో వెంటనే కేసు నమోదు చేసి, నాలుగు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసును తప్పుదోవ పట్టించడానికి క్షుద్రపూజల నాటకమాడినట్లు సాంకేతికత ఆధారంగా గుర్తించామన్నారు. త్వరలోనే పసికందును హతమార్చిన వారిని పట్టుకుంటామని ఆయన తెలిపారు. పిఠాపురం ప్రాంతంలో ఎప్పుడూ క్షుద్ర పూజలు, చేతబడులు వంటివి లేవని, ఇవి కేవలం కల్పితమే కాబట్టి ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

డైట్‌కు నూతన అధ్యాపకులు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 16 మంది ఎంపిక

రాయవరం: ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించబోయే వారికి శిక్షణనిచ్చే డిస్ట్రిక్ట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(డైట్) సంస్థకు నూతనంగా అధ్యాపకులు నియామకం చేపట్టారు. డైట్‌లో రెగ్యులర్ అధ్యాపకులను నియమించకుండా వారి స్థానంలో ప్రభుత్వ/జెడ్పీ/మున్సిపల్ తదితర యాజమాన్యాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ప్రిన్సిపాల్స్ నుంచి అర్హత ఉన్న ఉపాధ్యాయులను డెప్యుటేషన్‌పై నియమిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితికి నియమించిన అధ్యాపకులను ఇటీవల విధుల నుంచి విడుదల చేసి పంపించడంతో వారి స్థానంలో అవసరమైన సబ్జెక్టులకు కొత్త అధ్యాపకుల నియామక ప్రక్రియ చేపట్టారు. అందులో భాగంగా గత నెల ఒకటో తేదీన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం గత నెల 10వ తేది వరకు దరఖాస్తులు ఆహ్వానించారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన వారికి కాకినాడలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి, వారిలో ఉత్తీర్ణత సాధించిన వారిని ఇంటర్వ్యూకు ఆహ్వానించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గత నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహించి, మెరిట్ కమ్ సెలక్షన్ జాబితాను సిద్ధం చేశారు. దాని ప్రకారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 మంది అధ్యాపకులను వివిధ సబ్జెక్టులకు ఎంపిక చేశారు. పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు విడుదల చేసిన జాబితా ప్రకారం ఎంపికైన అధ్యాపకులు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశాల్లో విధుల నుంచి విడుదలై డైట్‌లో విధుల్లో చేరాల్సి ఉంది. డైట్‌కు ఎంపికైన అధ్యాపకుల స్థానాలను బదిలీలు/పదోన్నతులతో భర్తీ చేసే అవకాశముంది.


బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



అమలాపురం రూరల్: మండలంలో కామనగరువు బైపాస్ రోడ్డులో ఆమని ఆటోమొబైల్స్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతను ప్రమాదవశాత్తూ మరణించాడా లేదా ఎవరైనా హత్య చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి ఇతను. చనిపోయి మూడు రోజులు అయ్యి ఉంటుందని రూరల్ సీఐ ప్రశాంత్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

- తమ్ముడిని కాపాడేందుకు నదిలోకి దూకిన అన్నయ్య
- నీటి ప్రవాహంలో చిక్కుకున్న మృతుడి అన్నను కాపాడిన స్థానికులు


భార్గవ్ మృతదేహం

అల్లవరం: అమలాపురం మండలం కామనగరువు గ్రామానికి చెందిన కామన భార్గవ్ (24) బోడసకుర్రు బ్రిడ్జిపై నుంచి వైనతేయ నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కామనగరువు గ్రామానికి చెందిన భార్గవ్ అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో మోటార్ సైకిల్‌ని బోడసకుర్రు బ్రిడ్జిపై పార్కు చేసి నదిలోకి దూకేశాడని తెలిపారు. భార్గవ్ నదిలోకి దూకడంతో తన తమ్ముడిని రక్షించేందుకు అన్న రాజేష్ కూడా నదిలోకి దూకాడు. అయితే రాజేష్‌కు భార్గవ్ దక్కకపోవడంతో తన ప్రాణాలకు మీదకు తెచ్చుకున్నాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండి, చాలా లోతుగా ఉండడంతో రాజేష్ ప్రాణాపాయ స్థితిలోకి చేరాడు. ఇంతలో బ్రిడ్జిపై నుంచి లారీ డ్రైవర్ పగ్గాన్ని రాజేష్‌కు అందించడంతో తాడుని పట్టుకుని ప్రాణాలను కాపాడుకున్నాడు. ఇంతలో స్థానికంగా ఉన్న మత్స్యకారులు పడవలో వెళ్లి రాజేష్‌ని కాపాడి ఒడ్డుకి చేర్చారని పోలీసులు తెలిపారు. అయితే నదిలోకి దూకిన భార్గవ్ నీటి ప్రవాహానికి గల్లంతయ్యాడు. అయితే సాయంత్రానికి భార్గవ్ మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకి చేర్చారు. ఈ ఘటనపై కేసు నమోదు చూసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తిరుమలరావు తెలిపారు. భార్గవ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్టలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో తాళ్లపూడి పోలీసులు దాడి చేశారు. గురువారం పేకాట ఆడుతున్న పదిమంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,130 నగదు స్వాధీనం చేసుకొని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తల్లీకూతురు అదృశ్యం

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి శివారు ఆర్‌ఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న తల్లీ కూతురు శింగంశెట్టి రోజా, ఆమె తొమ్మిదేళ్ల కుమార్తె జశిత గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి పోయి అదృశ్యమయ్యారు. ఆమె భర్త బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి పట్టణ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో ఎస్సై కిషోర్‌బాబు దర్యాప్తు చేస్తున్నారు. వారి కథనం ప్రకారం... ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం ఉటుకూరు గ్రామానికి చెందిన బాలకృష్ణ ఓఎన్జీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఆర్‌ఆర్ నగర్‌లో తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. వీరిది ప్రేమ వివాహం. గతంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగినప్పుడు భార్య రోజా ఇంటి నుంచి వెళ్లిపోయి పది రోజులకు తిరిగి వచ్చిందని ఎస్సై కిషోర్‌బాబు తెలిపారు. పది రోజుల కిందట వీరి మధ్య మళ్లీ గొడవ జరిగి ఇంట్లోంచి తన బిడ్డతో భార్య వెళ్లిపోయింది. అయితే ఈసారి కూడా వెళ్లిన భార్య రోజా గతంలో మాదిరిగా తిరిగి వస్తుందని ఈ పది రోజులు బంధువుల ఇళ్ల వద్ద భర్త వాకబు చేశాడు. వారి ఆచూకీ ఎంతకీ తెలియకపోవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో భార్య, కూతురు అదృశ్యంపై భర్త బాలకృష్ణ గురువారం ఫిర్యాదు చేశాడని ఎస్సై కిషోర్‌బాబు చెప్పారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	19,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,000
గటగట (వెయ్యి)	18,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

